

మావుళ్లమ్మ దర్శనం పునఃప్రారంభం

భీమవరం టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ మూల విరాట్ దర్శనం బుధవారం పునఃప్రారంభ మైంది. వచ్చే నెల 13 నుంచి ప్రారంభం కానున్న అమ్మ వారి 61వ వార్షిక మహోత్సవాల సందర్భంగా విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం ఈ నెల 11 నుంచి దర్శనం నిలిపివేశారు. పనులు పూర్తి కావడంతో ఉదయం ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో తాళ్ళపూడికి చెందిన జంధ్యాల గంగాధరశాస్త్రి పర్యవేక్షణలో కళాన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. హోమాలు, మండపారాధన లు నిర్వహించారు. పూర్ణాహుతితో కార్యక్రమాన్ని పరిసమాప్తి చేశారు. గతంలో కలశంలోవున్న అమ్మవారి కళలను విగ్రహంలో తిరిగి నిక్షిప్తంచేశారు. తదుపరి అమ్మవారిని కుంభ దర్శనం, కూష్మాండ దర్శనం, గోదర్శనం, దర్పదర్శ నం తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. తొలుత పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయు లు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







లోక రక్షకుడి ఆగమనం.. మానవాళికి పుణ్యదినం

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో మంగళవారం రాత్రి నుంచి ప్రార్థనలు కొనసాగాయి. ఏలూరులో క్రీస్తు బోధనలు వినిపిస్తున్న బిషప్ పొలిమేర జయరాజు. సెయింట్ పాల్స్ చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు. (పక్కన.. ఉండి మండలం ఎన్ఆర్పీ అగ్రహారం ట్రినిటి దేవాలయంలో క్యాండిల్స్ ప్రదర్శన

కౌలుకు భరోసా



జిల్లాలో 80 వేల కౌలు రైతులకు రుణార్హత కార్డుల అందజేత

- రుణాలకు అర్హులు 46 వేల మందేనని బ్యాంకర్ల గుర్తింపు
- సార్వా, దాళ్వాలలో 13 వేల మందికి ఇచ్చిన రుణం రూ.163 కోట్లు
- మిగిలిన 33 వేల మందికి రుణాలు ఎందుకు ఇవ్వనట్లు..?

కౌలు రైతులకు చేయూతనిచ్చేలా రుణాలందించేందుకు రుణార్హత కార్డులు ఇచ్చినప్పటికీ అందరికీ రుణాలందించడంలో వెనుకబాటు కనిపిస్తోంది. కేవలం ఇరవై శాతంలోపు మాత్రమే రుణాలు పొందారు. అందరికీ అందించేలా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం వుంది.

భీమవరం రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణార్హత కార్డుల జారీకి రెవెన్యూ శాఖకు సూచనలిచ్చింది. జిల్లా అధికారులు గ్రామాల వారీగా కౌలు రైతుల సమాచారం సేకరించి 80 వేల కార్డులు అందించారు. వీరికి సార్వా పంటకు కౌలు రుణాలు అందుకునే అవకాశం వచ్చింది. సార్వా పంటకు తొమ్మిది వేల 740 మంది కౌలు రైతులకు రూ.141 కోట్లు కౌలు రుణాలుగా అందించారు. ఈ దాళ్వా పంటకు 3,273 మందికిగాను రూ.22 కోట్లు రుణాలు పొందారు. ఈ లెక్కన 13 వేల 13 మంది కౌలు రైతులు రూ.163 కోట్ల కౌలు రుణాలు అందుకోగలిగారు. మొత్తం 80 వేల కౌలు కార్డులందుకోగా, 46 వేల మంది కౌలు రైతులు అర్హులుగా గుర్తించినట్లు బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. కాని, 13 వేల 13 మంది కౌలు రైతులే రుణాలు పొందడం ఎక్కడ లోపమన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో మాదిరి ఎకరానికి రూ.10 వేలు రుణంతో సరిపెట్టకుండా బ్యాంకుల నుంచి రూ.50 వేలు పైగా కౌలు రుణాన్ని అందిస్తున్నారు. దీనిని బట్టి కౌలుకు సాగు చేసే రైతుకు సాగుకు పూర్తి పెట్టుబడి పెట్టుకునేలా రుణం బ్యాంకు నుంచి కౌలు కార్డు ద్వారా పొందగలుగుతున్నారు.

ఈ సమయంలో కౌలు రుణాలు అర్హత కలిగిన కార్డుదారులందరూ రుణాలు పొందడం వారికి ఉపయోగకరం. అయినప్పటికీ కొంత మందికే కౌలు రుణాలుగా మిగిలిపోవడం పట్ల వ్యవసాయాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టవలసి ఉంది. బ్యాంకర్లు, అధికారులు కౌలు రుణార్హత కార్డుల ద్వారా కౌలు రుణాలు పొందాలని పది రోజులపాటు జిల్లా వ్యవసాయ శాఖ వారు, బ్యాంకుల వారు కలిపి గ్రామసభలు నిర్వహించనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ చెబుతున్నారు. అవగాహన లేక కౌలు రైతులు రుణాలకు వెళ్ళడం లేదా, బ్యాంకర్లు అడిగే పత్రాలు కౌలు రైతులు అందించలేకపోతున్నారా అన్నది ఈ సభల్లో తేలే అవకాశం ఉంది. అప్పుడైనా కౌలు రుణాలు పొందేవారి సంఖ్య పెరుగుతుందని అనుకోవాలి.

రుణం వస్తే మొత్తం పెట్టుబడి పెట్టుకోవచ్చు

కౌలు రుణాలందించే విధానంలో మార్పు వచ్చింది. గతంలో కౌలు గ్రూపుల ద్వారా కౌలు రైతులు రుణాలు పొందేవారు. పది మంది కలిగిన ఒక్కో గ్రూపునకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందించేవారు. ఇప్పుడు ఒక రైతు కౌలు కార్డు ద్వారా రూ.50 వేలపైన రుణం బ్యాంకులు ఇస్తున్నారు. ఆ కౌలు రైతు ఎకరం సాగు చేస్తే రూ.35 వేలు పెట్టుబడి సరిపోతుంది. ట్రాక్టర్ నుంచి ఎరువులు, పురుగు మందులు, పంట కోత మిషన్‌కు ఇలా అన్ని ఖర్చులకు రుణం ద్వారా వచ్చిన సొమ్ముతోనే పెట్టుబడి పెట్టుకోవచ్చు. దీనివల్ల కౌలు రైతులకు పెట్టుబడి భారం అప్పు వడ్డీ భారం లేకుండాపోతుంది. పంటలో మిగులు కనిపిస్తుంది. అందువల్ల కౌలు కార్డులు పొందిన కౌలు రైతులందరూ కౌలు రుణాలు పొందితే సాగులో పెట్టుబడి ఇబ్బందులు ఉండవు.

బ్యాంకుల వారీగా పంపించాం

కౌలు రుణార్హత కార్డుల అర్హుల జాబితాను బ్యాంకుల వారీగా పంపించాం. భూమికి చెందిన యజమాని రుణం పొందకపోతే కౌలు రైతులకు కార్డుల ద్వారా రుణాలు ఇస్తున్నాం. కాబట్టి కౌలు రైతులు కార్డులను బ్యాంక్‌లకు తీసుకుని వెళ్లండి. పరిశీలించి వెంటనే రుణం మంజూరు చేస్తారు.

\- ఎ.నాగేంద్రప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్

నాట్లు పూర్తయ్యే వరకు రుణాలు

సార్వా పంటకు సంబంధించి కౌలు రైతులు చాలా మందికి రుణాలు మంజూరయ్యాయి. నాట్లు పూర్తయ్యే వరకు రుణార్హత కార్డుల ద్వారా ఇస్తున్నారు. అర్హులను గుర్తించి, వారందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

\- జడ్.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జాబితాలు సిద్ధం

- సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు
- టీడీపీ, జనసేన, బీజేపీలకు పంపకాలు పూర్తి
- అభ్యర్థుల ఎంపికకు నేతల కసరత్తు
- వారి చుట్టూ క్యూ కడుతున్న ఆశావహులు
- త్వరలోనే నియామకం.. అప్పటి వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌ల పాలన



జిల్లాలోని 122 సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలకు జాబితాలు సిద్ధమవుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో జాబితాలు కొలిక్కిరాగా, జనసేన ఎమ్మెల్యేలు వున్నచోట ఎంపికపై తర్జన భర్జన పడుతున్నారు. తమకు అవకాశం కల్పించాలని ఆశావహులు నేతల చుట్టూ క్యూకడుతున్నారు. కొన్ని రోజుల్లోనే దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

త్రిసభ్య కమిటీల ఏర్పాటుపై పది రోజుల క్రితమే ఎమ్మెల్యేలకు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లకు వర్తమానం అందింది. ప్రతి సంఘానికి అధ్యక్షుడితోపాటు, ఇద్దరు సభ్యులను నియమించుకోవాలని కూటమి అధిష్ఠానం నిర్ణయించింది. ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావించినా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు ఏడాదిపాటు త్రిసభ్య కమిటీలు వేయాలని కోరారు. ఆరు నెలల తర్వాత ప్రభుత్వం కమిటీల వైపే మొగ్గు చూపింది. పర్సన్ ఇన్‌ఛార్జ్‌ల కాల పరిమితిని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కమిటీలు ఏర్పాటైన వెంటనే పర్సన్ ఇన్‌ఛార్జ్‌లు వైదొలగుతారు. ఆరు నెలలు ఈ కమిటీలతో పాలన నిర్వహిస్తారు. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ కమిటీల నియామకం తర్వాత డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు కమిటీలపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది.

పోటీకి సిద్ధమే అంటున్న కేడర్

త్రిసభ్య కమిటీల్లో అధ్యక్ష పదవి కోసం టీడీపీ కేడర్ పట్టుబడుతున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని కూటమి నేతల ముందు అభిప్రాయాలు పంచుకుంటున్నారు. సొసైటీ పరిధిలోని గ్రామాల నాయకులను కూడదీసుకుని కూటమి నేతలను కలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు అవకాశం ఇవ్వండి. తర్వాత వచ్చే ఎన్నికల్లోనూ వ్యయ ప్రయాసలకు కట్టుబడి పోటీ చేస్తామంటూ స్పష్టం చేస్తు న్నారు. పోటీ అధికంగా ఉండడంతో జనసేన నియోజకవర్గాల్లో ఒత్తిడి పెరుగుతోంది.

టీడీపీ సిద్ధం

పాలకొల్లు, ఉండి, ఆచంట, తణుకు నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు త్రిసభ్య కమిటీ జాబితాలు సిద్ధం చేశారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న భీమవరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం నియోజకవర్గాల్లో ఇంకా కొలిక్కి రాలేదు. టీడీపీకి 50 శాతం సొసైటీలు ఇవ్వాలి. మిగిలిన 50 శాతంలో జనసేన, బీజేపీ సర్దుబాటు చేసుకోవాలి. జనసేన నియోజకవర్గాల్లో బీజేపీకి ఒక్కో సొసైటీ ఇవ్వాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తాడేపల్లిగూడెంలో 12 సొసైటీలుంటే ఆరు తెలుగుదేశానికి, ఐదు జనసేనకు, ఒకటి బీజేపీకి ఇవ్వాలి. భీమవరం, నర్సాపురం నియోజకవర్గ పరిధిలోనూ సర్దుబాటు దిశగా కసరత్తు చేస్తున్నారు. టీడీపీకి కేటాయించిన సొసైటీల్లో జనసేన నుంచి ఒకరికి, జనసేనకు కేటాయించిన వాటిలో టీడీపీ నుంచి ఒకరికి సభ్యునిగా అవకాశం కల్పిస్తారు. ఆ దిశగా సర్దుబాటు చేస్తున్నారు.



'పార్శిల్‌లో మృతదేహం' విస్తుగొలిపే నిజాలు

- ఆస్తి కోసం అక్కను టార్గెట్ చేసిన చెల్లెలు, మరిది
- నిందితుడు శ్రీధర్‌వర్మకు ఇద్దరు భార్యల సహకారం
- వర్షం రాకతో మృతదేహం తరలింపులో ఇబ్బందులు
- ఆపై కొత్త పెట్టె కొనుగోలు
- గాంధీనగర్ నివాసంలో క్షుద్రపూజల ఆనవాళ్లు
- ఘటనకు ముందు బంగారం తాకట్టు పెట్టిన రెండో భార్య
- నిందితులను స్టేషన్లు మార్చి మార్చి విచారణ
- ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడి : జిల్లా ఎస్పీ నయీం అస్మి

- మెయిన్‌లో..



నరసాపురం జాతీయ రహదారిపై పొగ మంచు

వీడని ముసురు

అల్పపీడనం.. చిరు జల్లులు

- వణికిస్తున్న చలిగాలులు.. పెరిగిన మంచు తీవ్రత

నరసాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. నరసాపురం, తాడేపల్లిగూడెం అత్యధికంగా 29 డిగ్రీలు, అత్యల్పంగా 22 డిగ్రీలు నమోదైంది. తణుకులో 28-23, భీమవరంలో 27-22, పాలకొల్లులో 26-24 నమోదయ్యాయి. బుధవారం సముద్రతీర ప్రాంతమైన నరసాపురం, మొగల్తూరు మండలాల్లో చలిగాలుల తీవ్రంగా వీచాయి. సాయంత్రం నుంచి గాలుల ఉధృతి పెరిగింది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. ఇటు మూడో రోజు వాతావరణం ముసురేసింది. అడపాదడపా చినుకులు పడ్డాయి. ఆకాశం మేఘావృతమైంది. ఇటు సముద్రంలో అలల ఉధృతి తగ్గలేదు. గాలులకు కెరటాలు ఎగసిపడ్డాయి. సాయంత్రం గాలుల తీవ్రత పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితయ్యారు. అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా వేట సాగలేదు. దీంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది. ఎండ లేకపోవడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజులు వాతావరణం ఇదే విధంగా ఉంటే సాగు నష్టపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. చలిగాలులకు మంచు పెరిగింది. ఉదయం ఎనిమిది గంటలు గడిచినా మంచు వీడటం లేదు. సాయంత్రం ఆరు గంటల నుంచి మొదలవుతోంది. ఇటు కోసిన సార్వా ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. మరికొందరు రోడ్డుపై ఉన్న ధాన్యపు రాశులను వర్షాలకు తడవకుండా బరకాలు కప్పుతున్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 1318 రకం వరి సాగు చేసిన బేతాళ శివనాగరాజు రెండున్నర ఎకరాల్లో సాగు చేయగా కురిసిన వర్షానికి తడిచి మొలకలు వచ్చాయని వాపోయాడు. జిల్లాలో మరో రెండు రోజులు ఇదే పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది.



పట్టణాల్లో మహిళా సంఘాలకు సమానంగా పురుషుల గ్రూపులను ఏర్పాటు చేయనున్నారు. వారు వ్యాపారులు చేసుకుని ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆకివీడు మున్సిపాలిటీల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. మార్చి 31లోగా ఒక్కో పట్టణంలో 30 గ్రూపుల చొప్పున ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే అనకాపల్లి మున్సిపాలిటీలో ప్రయోగాత్మకంగా నిర్వహించారు. అది విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల మాదిరిగా పురుష సంఘాలను ఏర్పాటు చేయించి, వారితో పొదుపు కట్టించి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తారు.



మేము సైతం..

- మహిళలకే కాదు.. పురుషులతోను స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- తొలి విడత భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆకివీడులో అమలు
- ఆరు కేటగిరీల్లో 180 గ్రూపులు.. ఒక్కో గ్రూపులో ఐదుగురు చొప్పున మొత్తం 900 మందికి లబ్ధి
- లబ్ధిదారుల గుర్తింపునకు మెప్మా అధికారుల చర్యలు

భీమవరం టౌన్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):గతంలోనే వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేసేవారు. అది మంచి ఫలితాలను సాధించింది. ఇప్పటికీ వ్యాపారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారు. ప్రతీ మునిసిపాల్టీలోను రెండు వందలకు పైగా వీధి వ్యాపారులకు రుణాలు మంజూరయ్యాయి. వివిధ విభాగాల్లో పనిచేసుకుంటున్న వారికి ఈ కొత్త తరహా రుణ సదుపాయం ద్వారా ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లా మొత్తం 180 గ్రూపులు ఏర్పాటు చేసి 900 మందికి రుణాలు మంజూరుచేసే అవకాశం ఏర్పడుతుంది. ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసేందుకు మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



రుణం మంజూరు ఇలా..

ఇందుకు పారిశుధ్య, భవన నిర్మాణ కార్మికులు, ఇళ్లలో పనిచేసేవారు, జిగ్, కేర్ వర్కర్లు, రిక్షా కార్మికులు అర్హులు. ఈ కేటగిరిలోని వారిని గుర్తించి ఐదుగురు సభ్యులతో ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి, వారి ద్వారా బ్యాంకుల్లో పొదుపు చేసేలా మెప్మా సిబ్బంది చూస్తారు. వీరితో ఆరు నెలలు పొదుపు చేసిన తర్వాత జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ నుంచి రూ.20 వేలు చొప్పున రివాల్వింగ్ ఫండ్‌ను అందజేసి వారు వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటారు. అన్నీ సక్రమంగా పూర్తి చేసుకుంటే వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సభ్యులు సక్రమంగా రుణం చెల్లిస్తే వారికి లక్ష, రెండు లక్షలు, ఐదు లక్షల వరకు పెంచుతూ రుణ సదుపాయం కల్పిస్తారు. ఆరు కేటగిరిల్లోని వారిని గుర్తించి, వారితో గ్రూపుల ఏర్పాటుపై అవగాహన కల్పించే దిశగా మెప్మా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు.


ఏలూరు ఆల్ సెయింట్స్ బీసీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ చేస్తున్న బిషప్ జాన్


చర్చిలో క్రీస్తు జననం తెలియజేసే పశువుల పాక


ఏలూరులో చిన్నారి శాంతాక్లాజ్‌ల సందడి

ఘనంగా క్రిస్మస్ వేడుక


ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక చర్చిలో ప్రార్థనలు

- క్రీస్తు జననం సంబరాలు
- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

క్రీస్తు జన్మదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు ప్రభువుకు ఘనస్వాగతం పలికాయి. ఏసు జననం తెలియజేసే పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, స్టార్స్ విద్యుత్ వెలుగుల్లో మెరిశాయి. మానవాళి రక్షణకు అవతరించిన ఏసుక్రీస్తును భక్తితో కొలిచి ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ మార్గంలో సర్వ మానవాళి ముందుకు సాగాలని చర్చి ఫాదర్‌లు తెలియజేశారు. పలు చర్చిలలో మంగళవారి రాత్రి నుంచి క్రిస్మస్ సందడి నెలకొంది. పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏలూరు జిల్లాలో ఎస్పీ కెపిఎస్ కిశోర్ ఆదేశాల మేరకు చర్చిల వద్ద పోలీసులు బందోబస్తు విధులను నిర్వర్తించారు.


ఏలూరు నగరంలో చర్చి వద్ద పోలీసు బందోబస్తు


ఏలూరు చర్చిలో మహిళ ప్రార్థన


బాల ఏసును పల్లకిలో ఊరేగిస్తున్న మహిళలు

పల్లకిలో బాల ఏసు

మరియ తనయుడు బాల ఏసును మహిళలు పల్లకిలో ఊరేగించారు. క్రిస్మస్ సంబరాల్లో భాగంగా దొరసానిపాడులో బుధవారం మహిళలు స్వయంగా పల్లకి మోశారు. పెళ్లి కావాలని వేడుకుంటూ యువతులు, సంతానం కోసం వివాహితలు పల్లకిలో బాల ఏసును మోస్తారని స్థానికులు చెబుతున్నారు.

- ద్వారకాతిరుమల



గోవిందా.. గోవిందా..

గోవింద నామ స్మరణతో చిన వెంకన్న క్షేత్రం మార్మోగింది. విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో చండీ హోమం చివరిరోజు కావడంతో మార్గమధ్యలో శ్రీవారి క్షేత్రానికి భవానీల రాకతో కిటకిటలాడింది. దాదాపు 15వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాల అంచనా. - ద్వారకాతిరుమల


దాత ఇచ్చిన బంగారం ఆలయానికి అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

మావుళ్లమ్మకు 100 కేజీల స్వర్ణ వస్త్రం

దాతల నుంచి బంగారం సేకరణ : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మకు త్వరలోనే 100 కేజీల బంగారంతో స్వర్ణ వస్త్రాన్నిసిద్ధం చేస్తామని, ఇప్పటికే 50 కేజీలకు పైగా బంగారంతో ఆభరణాలు చేయించామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తెలిపారు. పట్టణానికి చెందిన యు.దుష్యంత్ కుమార్, అరుణ కుమారి ఇచ్చిన 24 గ్రాముల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు బుధవారం దేవస్థానంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు దాతల నుంచి 74 కేజీల బంగారం సేకరించామని, 50 కేజీల బంగారంతో తొడుగు చేయించామన్నారు. మిగిలిన 24 కేజీలతో సంక్రాంతి తరువాత మరికొంత భాగాన్ని తయారుచేయిస్తామన్నారు. మరొక 26 కేజీలతో అమ్మవారికి నిలువెత్తునా బంగారం ఉండేలా దాతలను సంప్రదిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయానికి 3 షిఫ్టుల్లో ఆరుగురు గన్‌మెన్‌తో భద్రత కల్పించాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరినట్లే ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ, కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.


స్వామివారి చిత్రపటం వద్ద అన్నకుంభం, ప్రసాదం స్వీకరిస్తున్న మహిళలు

భక్తాంజనేయుడికి మహా నివేదన

నందమూరు గరువులో ముగిసిన ఉత్సవాలు

వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం నందమూరు గరువు శ్రీరామ భక్త ఆంజనేయస్వామి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు స్వామివారికి మహా నివేదన ఇచ్చిన అనంతరం కమిటీ సభ్యులు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. క్యూలైన్‌లో అన్న ప్రసాదం అందించారు. భక్తులు కూరలు, పులిహోర, చక్రపొంగలి, అన్నం, సాంబారుతో ప్రసాదం అందించారు. మధ్యాహ్నం సమయానికి భక్తుల తాకిడి పెరిగింది. క్యూలైన్‌లు రోడ్డుపైకి వచ్చేశాయి. ఆలయంతోపాటు ఎదురుగా ఉన్న పందరి కూడా భక్తులతో కిటకిటలాడింది. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో శృంగవృక్షం వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది.

గుంపర్రుకు చెందిన బండి శ్రీనివాస్‌కు చెందిన 2 కాసుల బంగారు బ్రాస్లెట్ పడిపోయింది. కమిటీ సభ్యులు మైక్‌లో ప్రచారం చేశారు. భీమవరానికి చెందిన రాంబాబుకు దొరకడంతో కమిటీ సభ్యుల ద్వారా పోగొట్టుకున్న శ్రీనివాసరావుకు తిరిగి అందజేశారు.


పెన్సిల్ లిడ్‌పై ఏసు క్రీస్తు


పెన్సిల్‌పై క్రీస్తు

నరసాపురం పట్టణంలోని రుస్తుంబాదాకు చెందిన సూక్ష్మ కళాకారుడు కొప్పినీడి విజయమోహన్ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పెన్సిల్ లిడ్‌పై ఏసుక్రీస్తు ప్రతిమను చెక్కారు. ఏలూరు నగరానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్‌బాబు ఏసుక్రీస్తు రూపాన్ని అగ్గిపుల్లపై చెక్కారు.

- ఏలూరు రూరల్/నరసాపురం టౌన్


అగ్గిపుల్లపై కరుణామయుడు

పంచ్ కొడితే.. పతకమే!



బాక్సింగ్‌లో రాణిస్తున్న పెనుమంట్ర విద్యార్థులు

బాక్సింగ్ అంటే వారికి ఎంతో ఆసక్తి. నిత్యం సాధన చేస్తూ రాటు తేలుతుంటారు. ఇప్పటికే ఎన్నో పతకాలు సొంతం చేసుకుని తమకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. బరిలో నిలిచి పంచ్ కొడితే పతకమే కైవసం చేసుకోవడం లక్ష్యంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పోటీల్లో పాల్గొంటూ బాలికలు సత్తా చాటుతున్నారు. గురువారం బాక్సింగ్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. - పెనుమంట్ర



ఒలింపిక్స్ పతకమే లక్ష్యం

బాక్సింగ్ అంటే ఎంతో ఇష్టం. ఒకపక్క డిగ్రీ చదువుకుంటూ పెనుమంట్రలో జీటీకే బ్లూ కార్నర్ బాక్సింగ్ క్లబ్‌లో శిక్షణ తీసుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం, జాతీ స్థాయిలో బంగారు, వెండి పతకాలు, రాష్ట్రస్థాయిలో 10 బంగారు, 5 వెండి పతకాలు సాధించాను. ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలన్నదే నా లక్ష్యం. తండ్రి శ్రీనివాస్ వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వహిస్తారు. తల్లి జ్యోతి గృహిణి. వారి ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్నా.

- కండిబోయిన మాధవి, పంపనవారిపాలెం



ఐఏఎస్ సాధించాలని కల

మాది వ్యవసాయ కుటుంబం. తండ్రి ఏడుకొండలు వ్యవసాయం చేస్తారు. అమ్మ మంగరత్నం గృహిణి. బాక్సింగ్‌లో రాణిస్తూనే చదువు కొనసాగిస్తున్నాను. ప్రస్తుతం పీజీ చేస్తున్నాను. ఐఏఎస్ సాధించాలనేది నా కల. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించా. జాతీయస్థాయిలో బంగారు, వెండి పథకాలు కైవసం చేసుకున్న. రాష్ట్రస్థాయిలో 10 బంగారు, 5 వెండి పతకాలు సాధించా. ఐదుసార్లు రాష్ట్రస్థాయి ఉత్తమ బాక్సర్ అవార్డు అందుకున్నాను.

- కోడి తేజస్విని వెంకట శైలజ, పంపనవారిపాలెం



ఒలింపిక్స్ బరిలో దిగుతా

పెనుమంట్రలో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 9 తరగతి చదువుతున్నాను. బాక్సింగ్ నేషనల్‌లో ఒక రజత పతకం సాధించాను. రాష్ట్రస్థాయిలో రెండు బంగారు పతకాలు, 3 రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాను. ఒలింపిక్స్ బాక్సింగ్ బరిలో దిగి బంగారు పతకం సాధించాలనేదే నా లక్ష్యం. తండ్రి చిరంజీవి, తల్లి నాగమణి బాక్సింగ్‌లో రాణించడానికి ప్రోత్సహిస్తున్నారు.

- కప్పల శరణ్య, బ్రాహ్మణ చెరువు



జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తా

బాక్సింగ్‌పై ఎంతో మక్కువ. ఎనిమిదో తరగతి చదువుతూ క్రీడల్లో పాల్గొంటున్నా. బాక్సింగ్‌లో 2 బంగారు, 3 రజత, 2 కాంస్య పతకాలు సాధించాను. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలి. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలన్నదే నా లక్ష్యం. మా తండ్రి జగదీశ్వర్ రెడ్డి, తల్లి శ్రీలక్ష్మీదేవి. బాక్సింగ్ పోటీలకు నిత్యం సాదన చేస్తా.

- కర్రి సంతోషి సుకన్య, నత్తారామేశ్వరం

ఏలూరు నగరంలో పేకాట స్థావరం

- పోలీసుల దాడి
- 32 మంది అరెస్టు
- రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ప్రధాన నిందితుడి పరారీ


దాడిలో స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. 32 మందిని అరెస్ట్ చేసి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వివరాలు తెలిపారు. ఏలూరు రూరల్ పరిధిలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో పేకాట స్థావరం కొనసాగుతోందని ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్, టూటౌన్ ఎస్ఐ దానం, రూరల్, టౌన్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కలిసి ఆ స్థావరంపై మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 32 మంది అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారన్నారు. పిల్లల వెంకటేష్ అలియాస్ గుట్కాలు, పెద్ది శ్రీను, నందమూరి వెంకటరత్నం స్థావరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.8.10 లక్షల నగదు, 25 సెల్‌ఫోన్లు, మోటారు సైకిల్, 15 పేక కట్టలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిపై ఆర్గనైజింగ్ యాక్టు కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామన్నారు. డీఎస్పీతో పాటు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై.. దొంగతనాలు

- 9 చోరీ కేసుల్లో దొంగ అరెస్టు
- రూ.13.8 లక్షల సొత్తు స్వాధీనం

భీమవరం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన అతడు దొంగతనాలు మార్గంగా ఎంచుకున్నాడు. రాత్రి వేళ ఇంటి తాళాలను పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నాడు, ఎట్టకేలకు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రూ.13.8లక్షల విలువైన 210 గ్రాముల బంగారం, 1200 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు తెలిపారు.

మెంటే వారి తోటకు చెందిన గోన వంశీ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. వ్యసనాలకు బానిస కావడంతో బోడపాటి ప్రవీణ్‌తో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడు భీమవరం పోలీసులకు పట్టుబడడంతో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో 9 చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. భీమవరం వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, టూ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 2, రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేశాడన్నారు. డీఎస్పీ ఆర్‌డి జయసూర్య పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఎం నాగ రాజు, టూటౌన్ సీఐ జి.కాళీ చరణ్, వన్ టౌన్ ఎస్ఎస్ఐ కిరణ్‌కుమార్ ప్రత్యేక బృందంతో నిఘా పెట్టడంతో బుధవారం ప్రకాశం చౌక్ సెంటర్లో అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతడి వద్ద బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకోవటంలో కృషిచేసిన సిబ్బందని ఆయన అభినందించి రివార్డును అందించారు.


నిందితుడి వివరాలు చెబుతున్న ఎస్పీ నయీం, డీఎస్పీ జయసూర్య, సీఐలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

ట్రక్ ఆటో ఢీకొని..

పెనుమంట్ర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నత్త రామేశ్వరం శివారు పంపన వారి పాలెం వద్ద మోటార్‌సైకిల్‌ను ట్రక్ ఆటో ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. పెనుమంట్ర గ్రామానికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు (23) ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో వాహన సిబ్బంది వెళ్లేసరికి అప్పటికే యువకుడు మృతి చెందాడు. ఎమర్జెన్సీ టెక్నీషియన్ బాలకృష్ణ పైలెట్ బ్రహ్మాజీ సహకారంతో సీపీఆర్ ప్రక్రియ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ప్రమాద తీవ్రతకు యువకుడి తల పగిలి మెదడు బయటకు వచ్చి కొంత దూరంలో పడి ఉండడం గమనించిన పలువురు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మృతుడి కాలు కూడా నుజ్జయింది. పెనుమంట్ర ఏఎస్ఐ వేంద్ర వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న కారు..

ద్వారకాతిరుమల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న కారు లారీని వెనుక నుంచి ఢీకొనడంతో కారులో ఉన్న ఒక యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన గెల్లి గౌతమ్ కుటుంబరావు (28), స్నేహితులు వి.భార్గవ్, గొల్ల తేజ, వెంకటశాయి, వి.భానుప్రకాష్ కలసి విజయవాడలో కారు అద్దెకు తీసుకుని మారేడుమిల్లి మంగళవారం రాత్రి 11 గంటలకు మారేడుమిల్లి బయలుదేరారు. ఎం.నాగులపల్లి శివారులో బుధవారం తెల్లవారుజాము 2గంటల ప్రాంతంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందగా కారు నడుపుతున్న భానుప్రకాష్ సహా 4గురు గాయపడ్డారు. స్థానికులు వారి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి గెల్లిసత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

తండ్రి మందలించాడని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవిస్తు బాధ్యత లేకుండా ఉన్న కొడుకును తండ్రి మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్ముగూడెంకు చెందిన పి.దావీదు వారం రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తున్నాడు. దీంతో తండ్రి బుధవారం సాయంత్రం మందలించాడు. మనస్తాపానికి గురైన దావీదు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే అతడిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో పురుగుమందు తాగి అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం మారుతీనగర్‌లో ఉంటున్న బోను శ్రీనివాసరావు (39) ఆర్థికంగా ఇబ్బందులతో పురుగుమందుతాగాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ కడుపులో 10 కేజీల కణితి

శస్త్రచికిత్సతో తొలగించిన వైద్యులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ అండాశయంలో 10 కేజీల గడ్డను ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ వైద్యులు తొలగించారు. వివరాలను ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి బుధవారం తెలిపారు. నగరానికి చెందిన 54 ఏళ్ల మహిళ ఎన్నో సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో రోగనిర్ధారణ పరీక్షలు చేయగా కడుపులో పెద్ద పరిమాణంలో కణితి ఉన్నట్టు తేలింది. గైనకాలజిస్టు కోగంటి రమ్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం ప్రసన్నకుమార్, ప్రశాంతి శస్త్రచికిత్సచేసి మహిళ కడుపు నుంచి 10కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె సాధారణస్థితికి వచ్చి, ఆరోగ్యంగా ఉందని వివరించారు.


కణితి తొలగించిన వైద్యుల బృందం

'భవ్య భీమవరం' పేరుతో మౌలిక వసతులు : జేసీ


అభివృద్ధి పనులకు జేసీ శంకుస్థాపన పూజలు

భీమవరంటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భవ్య భీమవరం పేరిట భీమవరంలో మౌలిక వసతుల అభివృద్ధికి శరవేగంగా పను లను ప్రారంభించినట్టు జేసీ, మునిసిపల్ స్పెషాలాఫీసర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం భీమవరంలోని నాలుగు ప్రాంతాల్లో మూడు పార్కుల అభివృద్ధి పనులు, భీమవరం పాత బస్టాండ్ నూతన కాంప్లెక్స్ ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత కాస్మో క్లబ్ వద్ద వంశీకృష్ణ నగర్‌లో నూతన పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పార్కు అభివృద్ధికి కాస్మో పొలిటిన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు నిధులను సమకూరుస్తున్నారు. ఏఎస్ఆర్ వాటర్ ట్యాంక్ పార్కులో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు, అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఏఎస్ఆర్ సేవా సమితి దాతలు నిధులను అందిస్తున్నారు. హౌసింగ్ బోర్డుకాలనీలోని ఆదిత్య కళావేదిక పార్కులో మౌలిక వసతుల అభివృద్ధికి శంకుస్థాపన చేయగా, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు నిధులను సమకురుస్తున్నారు. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని పాతబస్టాండ్ కలెక్టర్ నాగరాణి చొరవతో జేసీ పర్యవేక్షణలో దాతల సహకారంతో శంకుస్థాపన జరిగింది. పాత బస్టాండ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణానికి రామభద్ర రాజు ట్రస్టు అధ్యక్షుడు చేకూరి రామభద్రరాజు నిధులను సమకూర్చనున్నారు. చివరిగా భవ్య భీమవరం టైటిల్‌ను జేసీ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమాల్లో కాస్మోపాలిటన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ కాశీ విశ్వనాథరాజు, లయన్ ఇంటర్నేషనల్ సీహెచ్ కృష్ణంరాజు, రామభద్ర రాజు ట్రస్టు అధ్యక్షుడు చేకూరి రామభద్రరాజు, సామంతపూడి శ్రీరామరాజు, సరిపిడకుల రామారావు, కంతేటి వెంకటరాజు, రమేష్, కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పిల్లలకు పలకలు అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తదితరులు

మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన విద్య అందిస్తాం

తాడేపల్లిగూడెం రూరల్/తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ప్రాంతాలకు నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండ్రుప్రోలు కొత్తకాలనీలో బుధవారం నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని ప్రాంతాలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని దీనికి దాతలు సహకరించి ముందుకు వస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా కొండ్రుప్రోలు మూడు కిలోమీటర్ల దూరంలో అంగన్‌వాడీ కేంద్రం ఉండేదని పిల్లలు ఇబ్బందుల దృష్ట్యా పట్టణంలో ఖాళీగా ఉంటున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇక్కడకు బదిలీ చేయించామన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు పలకలు, స్వీట్లు పంపిణీ చేశారు. జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, పట్టణాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

• పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామానికి మంజూరైన ట్రాక్టర్‌ను బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. నీటి సంఘం అధ్యక్షుడు కోలా మార్కండేయులు, కోడే కాశి తదితరులు పాల్గొన్నారు.


జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

వైసీపీ నుంచి 70 మంది జనసేన పార్టీలో చేరిక

గణపవరం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా పలువురు జనసేన పార్టీలో చేరడం శుభపరిణామం అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గణపవరానికి చెందిన వైసీపీ నాయకుడు గాదిరాజు ఈశ్వరరాజు ఆధ్వర్యంలో 70మంది వైసీపీకి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, వంగా రఘు, తోట శ్రీనివాసరావు, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బండారుకు పలువురి పరామర్శ


బండారును పరామర్శిస్తున్న మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

నరసాపురం రూరల్/భీమవరం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పితృవియోగమైన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడిని బుధవారం పలువురు పరామర్శించారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో ఉంటున్న మాధవనాయుడు నివాసానికి మంత్రి నిమ్మల రామనాయుడు, భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ వెళ్లి ప్రతాప్‌నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతాప్‌నాయుడు ఆకస్మిక మరణానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.


తణుకు రూరల్ పోలీసుస్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

గో సంరక్షణ సమితి నాయకుల ఆందోళన

తణుకు, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): తేతలి పరిధిలోని సత్యవాడ రోడ్డులోని లేహం పరిశ్రమను మూసేవరకు తమ పోరాటం ఆగదని గోసంరక్షణ సమితి, తేతలి గ్రామ ప్రజలు అన్నారు. బుధవారం పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇంతలోనే శ్రీచక్ర అనే వాహనం ఫ్యాక్టరీ నుంచి బయటకు రావడంతో అడ్డుకున్నారు. వాహనంలో మాంసం ఉండడంతో తణుకు రూరల్ పోలీసులకు గోసంరక్షణ సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు విషయంలో కొద్ది గందరగోళం నేపథ్యంలో మహిళలు అక్కడే రోడ్డుపై బైఠాయించారు.

27న వైసీపీ పోరుబాట


పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి కొట్టు, తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్/ఆకివీడు రూరల్, డిసెంబరు 25 : ఎన్నికల హామీని విస్మరించి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను ఖండిస్తూ వైసీపీ పోరుబాట కార్యక్రమం ఈనెల 27న నిర్వహిస్తామని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆరోజున అన్ని సబ్‌స్టేషన్‌ల వద్ద నిరసన చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. పోరుబాట పోస్టరును ఆవిష్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, కర్రి భాస్కరరావు, జె.హరిబాబు, కులుకూరి ధర్మరాజు, ఎలిశెట్టి నరేంద్ర, బి.శ్రీనివాస్, గేకా వెంకటేశ్వరరావు, సిర్రాపు శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆకివీడు మండలం చినకాపవరంలోని జడ్పీటీసీ యండగండి శ్రీను నివాసంలో పార్టీ నాయకులతో కలిసి పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. జడ్పీటీసీ యండగండి శ్రీను, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, అంబటి రమేష్, అన్నవరం, మెంటే లక్ష్మయ్య, అన్నెం కృష్ణ, చిక్కాల చిన్న, నిమ్మలనాగు, గేదెల అప్పారావు, కత్తుల శ్రీను, ఆలీ తదితరులు పాల్గొన్నారు.


భీమవరం బేతని చర్చి వద్ద క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పాస్టర్ తదితరులు..


ఆకివీడు చర్చిలో క్రిస్మస్ సందేశమిస్తున్న పాస్టర్


క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు


ఆచంట తిమోతిరాజు చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ప్రేమరాజు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

» చర్చిలలో క్రైస్తవుల ప్రార్థనలు
» ఆకట్టుకున్న యువతీ యువకుల సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా కిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రిస్మస్ కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నరసాపురం టౌన్/మొగల్తూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :నరసాపురం పట్టణ, మండలంలో బుధవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. లూథరన్, జీడీఎం, జీవనజ్యోతి, పెంతికోస్తు, టీబీజీ, ఎష్కోన, స్టేషన్ పేట, మండలంలోని కొత్త, పాత నవరసపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థ నలు నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలోని లూథరన్ చర్చి ఫాదర్ మార్టిన్‌కు పాలకవర్గం సభ్యులు బొకే అందించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మొగల్తూరు ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ అయినవర్తి పీటర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మొగల్తూరు ప్యారిష్ టూ పరిధిలో రెవరెండ్ ఫాదర్ టి.కొండయ్య మార్టిన్ మోజెష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

• పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణంలోని దేవునితోట, లాకుపేట, క్రిస్టియన్ పేట, శంభుని పేట, బద్దావాని పేట, పూలపల్లి, చందపర్రు, భగ్గేశ్వరం, సగం చెరువు, బల్లిపాడు, ఎస్‌చిక్కాల, వెంకటాపురం, కొత్తపేట, మామిడిపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ ప్రార్థనలు, ఆరాధనలు, యువతీ యువకులు నాటకాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

• భీమవరం అర్బన్ : క్రిస్మస్ పండుగ సందర్భంగా బేతనీ చర్చి పాస్టర్ ఎస్. డేనియల్ పుష్పరాజ్ మాట్లాడుతూ క్రీస్తు జననం ఒక అద్భుతమన్నారు. డాక్టర్ పట్టా దేవరాజ్, డాక్టర్ వర్గీస్ డానియేల్, బందెల సునీల్, గంటా సుందరకుమార్, ఆర్.రవికుమార్, గంటా రాహుల్ రిచర్డ్, డీజే హెరాల్డ్, గొల్లా రాజ్‌కుమార్, గూట్ల రాజశేఖర్, ఎం.కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

• ఆకివీడు/కాళ్ల/పాలకోడేరు/ఉండి : ప్రేమకు ప్రతీక క్రిస్మస్ అని పాస్టర్‌లు అన్నారు. ఆకివీడులోని ఆంధ్రా టౌన్, సెంట్రల్, హోప్, యునైటెడ్, ఎల్‌ఈఎఫ్, గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలు, సీబీసీఎన్‌సీ, మేరీమాత ఆర్‌సీఎం, ఇమ్మాన్యుయల్ ప్రార్థనా మందిరం తదితర చర్చల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాళ్ల మండలంలో చర్చిల వద్ద క్యాండిల్స్ వెలిగించి కేకలు కట్ చేశారు. విశ్వాసులు ప్రత్యేక పాటలు పాడి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు. పాలకోడేరు మండంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలతో ఊరేగింపులు చేశారు. ఉండి మండలం యండగండి, చెరుకువాడ, ఉండి పెదపేట తదితర చోట్ల క్రిస్మస్ పండుగను నిర్వహించారు. పాస్టర్లు, సంఘస్థులు, చిన్నారులు, పెద్దలు, యూత్‌వారు నూతన దుస్తులను ధరించి క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకున్నారు. చర్చిలో క్యాండిల్స్ సర్వీస్‌ను జరిపారు.

• పెనుగొండ/ఆచంట: పెనుగొండ మండలం పెనుగొండ రాజుగూడెంలో గల లూథరన్ చర్చిలో సండే స్కూలు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్యారిస్ పాస్టర్ కృష్టాఫర్, పాస్టర్ ఉందుర్తి బాబూరాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందేశం అందించారు. సింగర్ సతీష్‌కుమార్ ఆలపించిన మధురగీతాలు ఆకట్టుకున్నాయి. ఆచంట మండలం ఆచంటలో ఉన్న తిమోతిరాజు పెదపేట చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ జి.తిమోతిరాజు, డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

• గణపవరం : ఏసు చూపిన మార్గం ఆచరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. గణపవరం మండలం పిప్పరలో కొలనువాడ సుబ్బరాజు సౌజన్యంతో క్రిస్మస్ సందర్భంగా బుధవారం రోగులకు నగదు, పండ్లు పంపిణీ చేశారు.

క్రిస్మస్ పండుగ వెలుగులు నింపాలి : బొలిశెట్టి

పెంటపాడు : క్రిస్మస్ పండుగ ప్రతీఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెంటపాడు ఎస్సీ కాలనీలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా ఆయన కేక్ కట్ చేశారు. దాసరి అప్పన్న, పుల్లా బాబి, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ : అంజిబాబు

భీమవరంటౌన్ : కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ రోడ్డులోని చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, గంటా త్రిమూర్తులు, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

• పెంటపాడు : అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, హెచ్‌ఎం కళ్యాణి, ఏవో నాగరాజు, మదర్‌వన్నిని సిబ్బంది పాల్గొన్నారు.


టీబీఆర్ క్రిస్మస్ వేడుకలలో మాట్లాడుతున్న చైర్మన్ భోగేశ్వరరావు


పెనుగొండ లూథరన్ చర్చి వద్ద క్రిస్మస్ సందడి


గొరగనమూడిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, చిన్నారులు


పాలకొల్లులో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


వీల్‌చైర్‌ను అందిస్తున్న మానవత సభ్యులు

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత

తణుకు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తణుకు మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో పుట్టుక నుంచి అంగవైకల్యం కలిగిన నడవలేని స్థితిలో ఉన్న ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామానికి చెందిన బొండాల దుర్గ లలితకు చిట్టూరి అచ్యుతరామప్రసాదు జ్ఞాపకార్థం ఆయన భార్య సుజాత విరాళంతో వీల్ చైర్‌ను అందజేశారు. బుధవారం రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మెన్ గమిని రాంబాబు, ఎస్‌వీ సతీష్‌బాబు, రామకాశీ, అక్కిన కాశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళీకృష్ణరాజుకు సత్కారం

పాలకోడేరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డెల్టా ప్రాజెక్ట్ కమిటీ జిల్లా చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కునాథరాజు మురళీకృష్ణంరాజును పాలకోడేరు గౌడ సంఘం నాయకులు బుధవారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితోపాటు జిల్లాలోని అన్ని కాల్వలను ప్రక్షాళన చేసి సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతానన్నారు. పాలకోడేరు గౌడ సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు-రేపు సమాచారం

పెంటపాడు : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెద కృష్ణంరాజు తెలిపారు. వైద్యులు ఉచితంగా అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• **పాలకోడేరు :** పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో రెడ్డియ్య తెలిపారు.

• **నరసాపురం :** నరసాపురం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. తొలిరోజున మాజీ పార్లమెంట్ సభ్యులు ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు.

• **కాళ్ళ :** విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బొండాడ, బొండాడపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

• **తాడేపల్లిగూడెం రూరల్ :** షెడ్యూల్డ్ కులాల ఉపకుల వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ సమావేశం ఏలూరు గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహిస్తామని ఎస్సీ సంక్షేమ సాధికారత జిల్లా ఇన్‌చార్జి అధికారి బీవీఎస్‌బీ రామాంజనేయరాజు తెలిపారు.



పాలకొల్లు, నరసాపురంలో వాజపేయి చిత్రపటాలకు బీజేపీ నాయకుల నివాళులు

ఘనంగా వాజపేయి శత జయంతి వేడుకలు

పాలకొల్లు అర్బన్/కాళ్ల/తణుకు/ తాడేపల్లిగూడెం రూరల్/నరసాపురం టౌన్/అత్తిలి/పోడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పితా మహుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ అన్నారు. బుధవారం పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో వందో జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి కొల్లి కొండప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ ఇన్‌చార్జి ఉన్నమట్ల కపర్ధి, బోడ సత్యకనక రాజు, గవర పవన్ నాయుడు, ఎస్‌టీపీ రఘుబాబు తదితరులు పాల్గొన్నారు. కాళ్ళ మండలం కోలనపల్లి గ్రామ పంచాయతీలో బిజెపి మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో, తణుకులో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో వాజపేయి జయం తి వేడుకలు నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో పార్టీ జిల్లా నాయకుడు కొండపల్లి నగేష్ ఆధ్వర్యంలో, నరసాపురం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో వాజపేయి చిత్రపటానికి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అత్తిలి మండలం పాలిలోని పోలింగ్‌బూత్ 153లో వాజపేయి జయంతిని బూత్ నూతన అధ్యక్షుడు మల్లిడి కలికిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు ద్వారంపూడి వెంకటసుబ్బారెడ్డి, పాలి నీటి సంఘం డైరెక్టర్ మేడపాటి అప్పారెడ్డి, కొవ్వూరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలో వాజపేయి జయంతి వేడుకలను పాలకొల్లు నియోజకవర్గ బీజేపీ ఇనిచార్జి యర్రంశెట్టి పద్మారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ కో-కన్వీనర్ దొంగ నరసింహకుమార్, జిల్లా బీజేపీ మహిళాధ్యక్షురాలు అల్లూరి పద్మవర్మ, బీజేపీ నాయకులు ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి


తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న స్వామిజి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా స్వయం ప్రతిపత్తి కల్పించాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజి పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావంలో భాగంగా పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్‌లో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజి మాట్లాడుతూ ప్రభుత్వం దేవదాయశాఖను రద్దుచేయాలని కోరారు. దేవదాయశాఖలో అధికశాతం అవినీతిపరులు ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ ప్రతీ హిందువు బాధ్యతగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గ కన్వీనర్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి, మహిళా సమన్వయ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మావతి, ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు సుంకవల్లి రామకృష్ణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వాసవీ శాంతి ధామ్‌లో ప్రత్యేక పూజలు


పూజా కార్యక్రమాల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన భక్తులు

పెనుగొండ, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవీ శాంతి ధామ్ క్షేత్రంలో గోమాత పూజ, నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం పూజ వాసవి హోమం కార్యక్రమాన్ని కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి విచ్చేసిన భక్తులతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు శిష్ఠా సాయి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ధనుర్మాసం పదో రోజు పూజలు

పాలకొల్లు అర్బన్ : నీ భవనం గడియను తీయవమ్మా అని మేనత్తను గోపాలుడు పిలిచిన రోజును ఘనంగా జరుపుకుందాం అని పాశురార్థం. ధనుర్మాసం పదో రోజు బుధవారం వైష్ణవ ఆలయం అష్టభుజ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

• ఆకివీడు : ఆకివీడు రామాలయంలో శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆకివీడు సంత మార్కెట్‌లో ఉన్న కల్యాణ రామాలయంలో బుధవారం ధారుధ్వజ స్తంభమునకు సంప్రోక్షణలో భాగంగా మూలమంత్ర పూర్వక హోమం, పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు.


విద్యార్థి జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

బెస్ట్ ఫిజిక్ పోటీల్లో ఏఎస్ఎన్ఎం విద్యార్థికి సెకండ్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఏ ఎకనామిక్స్ (ఫస్టియర్) విద్యార్థి ఎ.జగదీష్ యూనివర్శిటీ స్థాయిలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఇటీవల నన్నయ వర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బెస్ట్ ఫిజిక్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో జగదీష్ ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, వైస్‌ప్రిన్సిపాల్ టి.కృష్ణ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.మహేష్ అభినందించారు.

పేదల ఆరోగ్యమే కూటమి లక్ష్యం

» మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు 36 మందికి రూ.22లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్యసేవలు పొంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి పేదలకు సీఎం సహాయ నిధి చెక్కులు అందచేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండలాల టీడీపీ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్, కృష్ణా జిల్లా బీజేపీ ఇనిచార్జి ఉన్నమట్ల కబర్ధి, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.